# సాక్షి
# జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం । 3 । డిసెంబర్ । 2024






**ఎఫ్‌సీఐలో బియ్యం నిల్వలు ఫుల్..**
కాజీపేటలోని ఎఫ్‌సీఐ గోడౌన్లలో బియ్యం నిల్వలు పెరుగుతున్నాయి. మిల్లర్ల నుంచి సీఎంఆర్ వస్తుండడంతో గోడౌన్లు బియ్యం బస్తాలతో నిండిపోతున్నాయి. - 8లో▸



**బాలికల బాక్సింగ్ పోటీలు షురూ**
పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం అండర్–17 రాష్ట్ర స్థాయి బాలికల బాక్సింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. - 8లో▸

**వాతావరణం**
గరిష్టం/కనిష్టం
28.2° /23.6°
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్


### మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ కిరణ్ ఖరే



**భూపాలపల్లి:** వివిధ రకాల మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా దివస్ కార్యక్రమంలో భాగంగా 18మంది బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలను ఓపికగా విని, వాటిని చట్టప్రకారం పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది అలసత్వం వహించవద్దని ఎస్పీ పేర్కొన్నారు.

### కలప పట్టివేత



**కాటారం:** కాటారం మండలం మీదుగా భూపాలపల్లి వైపు అక్రమంగా జిట్రేగి కలప తరలిస్తున్న వాహనాన్ని సోమవారం తెల్లవారుజామున మండలంలోని మేడిపల్లి టోల్‌గేట్ వద్ద అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. అక్రమంగా కలప తరలిస్తున్నారని అటవీశాఖ పలిమెల రేంజ్ పెట్రోలింగ్ టీంకు సమాచారం అందింది. దీంతో కాటారం, పెగడపల్లి, భూపాలపల్లి రేంజ్ అధికారులకు సమాచారం చేరవేసి కలప తరలిస్తున్న వాహనాన్ని వెంబడించారు. చివరకు మేడిపల్లి టోల్‌గేట్ వద్ద వాహనాన్ని పట్టుకోగా రవాణాదారులు పారిపోయారు. వాహనంలో అక్రమంగా జిట్రేగి దుంగలను తరలిస్తున్నట్లు గుర్తించారు. 24 దుంగల విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని పలిమెల రేంజ్ అధికారి నాగరాజు తెలిపారు. పట్టుకున్న వాహనం, కలపను స్వాధీనపర్చుకొని మహదేవపూర్ కలప డిపోకు తరలించినట్లు పేర్కొన్నారు. అక్రమ రవాణాకు ఎస్కాట్‌గా వ్యవహరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు, వాహనాన్ని వదిలి వెళ్లిపోయిన కలప రవాణాదారులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎఫ్ఆర్ఓ తెలిపారు.

### బొగ్గు ఉత్పత్తి లక్ష్యం పూర్తిచేయాలి



**భూపాలపల్లి రూరల్:** సింగరేణి యాజమాన్యం నిర్ణయించిన నిర్దేశిత లక్ష్యం ప్రకారం అన్ని బొగ్గు గనుల్లో బొగ్గు ఉత్పత్తి కోసం కార్మికులు, సూపర్‌వైజర్లు, అధికారులు సమష్టిగా కృషిచేయాలని భూపాలపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి కోరారు. జీఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెలలో భూపాలపల్లి సింగరేణి డివిజన్ పరిధిలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 5.42 లక్షల టన్నుల వరకు సంస్థ నిర్ణయించిందన్నారు. కార్మికుల గైర్హాజరు శాతాన్ని తగ్గించడానికి గనుల వారీగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గనుల్లో ఏర్పాటుచేసిన ఎస్‌డీఎల్ యంత్రాల పనిగంటలు పెంచాలన్నారు. పనిస్థలాల్లో పకడ్బందీగా రక్షణ చర్యలు తీసుకోవాలని ఆయా గనుల మేనేజర్లను జీఎం ఆదేశించారు. ఏరియాలో గడిచిన నెలలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 4.41 లక్షల టన్నులకు గాను 3.80 లక్షల టన్నుల వరకు బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు పేర్కొన్నారు. కారుణ్య నియామకాలు కూడా ఏ మాత్రం జాప్యం లేకుండా వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. పదవీ విరమణ పొందిన వారికి సింగరేణి సంస్థ చెల్లించే సామాజిక భద్రత స్కీముల ద్వారా వచ్చే మొత్తాన్ని వెంటనే అందజేయటానికి కృషిచేస్తున్నట్లు రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఏరియాలోని కేటీకే 3వ ఉపరితల గని కోసం భూసేకరణ పనులు కూడా వేగవంతంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అధికార ప్రతినిధి కె.మారుతి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### నేషనల్ అర్చక రత్న అవార్డుకు లక్ష్మణ్ ఎంపిక

**భూపాలపల్లి రూరల్:** నేషనల్ అర్చక రత్న అవార్డుకు భూపాలపల్లి మండలం కొత్తపల్లి (ఎస్ఎం) గ్రామానికి చెందిన సిరిసన్న గండ్ల లక్ష్మణ్ ఎంపికైనట్లు బహుజన సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డుకు సంబంధించిన ఆహ్వానపత్రం లక్ష్మణ్‌కు అందించారు. డిసెంబర్ 15న ఢిల్లీలో జరిగే సదస్సులో అవార్డును అందజేయనున్నట్లు నల్ల రాధాకృష్ణ తెలిపారు.

# ఖాకీల్లో.. కలవరం

**క్షణికావేశంలో తనువు చాలిస్తున్న పోలీసులు**

- ఉమ్మడి వరంగల్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ఘటనలు
- తాజాగా ఎస్ఐ హరీశ్ ఆత్మహత్యతో పెను విషాదం



వాజేడు: బెడ్‌పై రక్తపు మడుగులో హరీశ్ మృతదేహం



హరీశ్, ఎస్ఐ (ఫైల్)

సాక్షిప్రతినిధి, వరంగల్ :

కారణాలేమైనా కావచ్చు కానీ కష్టపడి పోలీసు కొలువు సాధించిన కొందరు అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. ప్రజల్లో మనోధైర్యాన్ని నింపాల్సిన పోలీసులు అధైర్యానికి లోనవుతున్నారు. కొద్ది సంవత్సరాలుగా వివిధ కేడర్‌లలోని పోలీసులు ఏదో ఒక కారణంతో ఆత్మహత్యలకు పాల్పడుతుండడం.. ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగిన పలు ఘటనలు ఆ శాఖను కలవరపెడుతున్నాయి. అధికారుల ఒత్తిడి... వ్యక్తిగత సమస్యలు.. కొన్ని చెప్పుకోలేనివి.. ఇలా కారణాలు చూపుతూ కన్నవాళ్లను, భార్య, పిల్లలను వదిలి తనువు చాలిస్తున్నారు. జీవితం ఎంతో విలువైనది.. ఈ విషయాన్ని విస్మరించి.. చిన్నచిన్న విషయాలకు బలవన్మరణానికి పాల్పడడం మంచిది కాదని మానసిక వైద్య నిపుణులు అంటున్నారు.



వాజేడు: సంఘటనా స్థలంలో ఎస్పీ శబరీష్

**ఎస్ఐ హరీశ్ ఆత్మహత్యతో మరో విషాదం..**

ములుగు జిల్లా వాజేడు ఎస్ఐ రుద్రారపు హరీశ్ (29) సోమవారం తెల్లవారు జామున సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్యహత్యకు పాల్పడటం పోలీసువర్గాల్లో కలకలం రేపింది. వాజేడు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రుద్రారపు హరీశ్ స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం వెంకటేశ్వర్లపల్లె. అతని సోదరుడు పోలీసు సర్వీసు (సీఆర్‌పీఎఫ్)లో సీఐగా ఉండగా.. 2020–21 బ్యాచ్‌కు చెందిన హరీశ్‌కు మంచి పేరుంది. మొదటి పోస్టింగ్ పేరూరులో చేసిన ఆయన రెండో పోస్టింగ్‌లో వాజేడు పోలీసుస్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ క్రమంలో ఏటూరు నాగారం మండల పరిధిలోని ముళ్లకట్ట బ్రిడ్జి సమీపంలో ఉన్న ఓ రిసార్ట్ లో హరీశ్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ప్రాణాలు విడవడం సంచలనం కలిగింది. కాగా ఆయన ఆత్మహత్యకు కారణం వివాదంగా మారిన ప్రేమ వ్యవహారమని ప్రచారం జరగ్గా.. వ్యక్తిగత కారణాలతోనే హరీశ్ ఆత్మహత్యకు పాల్పడ్డారని సంఘటన స్థలాన్ని సందర్శించిన ములుగు ఎస్పీ షబరీష్ మీడియాకు వెల్లడించారు.

**ఒత్తిడి అధిగమించలేక, జీవనశైలిలో సంతృప్తి పొందలేకనే..**



జీవితంలో ఒత్తిడిని అధిగమించకలేక, జీవనశైలిలో సంతృప్తి పొందలేకపోవడం వల్ల ఆత్మహత్యలకు ఒడిగడుతూ ఉంటారు. ఈ పదేళ్ల కాలంలో ఆత్మహత్యలకు ఒడిగట్టే శాతం రెట్టింపు అయ్యింది. 15 నుంచి 35 సంవత్సరాల వయస్సు మధ్య గల వారు ఆత్మహత్యలకు ఒడిగడుతున్నారు. వీరిలో ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఉండే ఉద్యోగ, వ్యాపారులతో పాటు రైతులు, విద్యార్థులుంటున్నారు. ఉద్యోగుల్లో ఉన్నతాధికారుల ఒత్తిళ్లు, వ్యాపారస్తుల్లో లాభనష్టాలు, రైతుల్లో పంట నష్టాలు, విద్యార్థుల్లో పోటీతత్వం ఇలాంటి కారణాలు బలవన్మరణం వైపు దారి తీస్తున్నాయి. అదేవిధంగా ఒంటరిగా జీవించే వారు, జన్యుపరంగా ఆత్మహత్యలు చేసుకునే వారిపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతూ జాగ్రత్తలు పాటించాలి. ఈ మధ్య కాలంలో ఒకేసారి రెండు(కాన్ఫ్లిక్ట్) కావాలని, దేనిని పొందాలో తెలియక సతమతమవుతూ ఆత్మహత్యలకు ఒడిగడుతున్నారు. ఆత్మహత్య చేసుకుంటానని తరచూ మాట్లాడే వారితోపాటు,, ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిన వారిని ప్రత్యేక గమనిస్తూ, వారికి జీవితం విలువ తెలియజేయాలి.

- డాక్టర్ మన్మోహన్‌రాజు, ప్రముఖ మానసిక వైద్యనిపుణులు

### పోలీసువర్గాల్లో ఆత్మహత్యల కలకలం..

ఖాకీ వనంలో ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. వివిధ కేడర్‌లకు చెందిన పలువురు ఆత్మహత్యలకు పాల్పడటం కన్నవాళ్లకు కడుపుకోత మిగుల్చుతోంది.

- వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేటకు చెందిన శ్రీరాముల శ్రీనివాస్ (38) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్ఐగా పనిచేస్తూ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉన్నతాధికారుల వేధింపులు భరించలేక తాను పురుగుల మందు తాగి చనిపోతున్నానని గత జూన్ 30న మహబూబాబాద్ సమీపంలో సెల్ఫీ వీడియో ద్వారా తన ఆవేదనను వెలిబుచ్చిన శ్రీనివాస్ చికిత్సపొందుతూ వారం రోజుల తర్వాత తుదిశ్వాస విడిచారు.
- సత్తుపల్లిలోని ఏఆర్ బెటాలియన్‌లో ఏఎస్ఐగా పనిచేసిన పడిగ శోభన్ బాబు తన స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం బావురుగొండలో ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యక్తిగత కారణాలే శోభన్ ఆత్మహత్యకు కారణంగా అధికారులు తర్వాత ప్రకటించారు.
- జనగామటౌన్ ఎస్ఐగా ఉన్న కాసర్ల శ్రీనివాస్ 2023, ఏప్రిల్ 6న తన ఇంట్లోని బాత్రూమ్‌లో సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని ప్రాణాలు వదలడం అందరినీ కలచివేసింది. కొద్దిగంటల ముందే భార్య కాసర్ల స్వరూప బలవన్మరణం పొందటాన్ని తట్టుకోలేక శ్రీనివాస్ కూడా ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు.



- 2024 అక్టోబర్ 13న సాయంత్రం 4.30 గంటల సమయంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రం ఎన్జీఓస్ కాలనీకి చెందిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ గుడిబోయిన శ్రీనివాస్ (59) తన ఎస్ఎల్ఆర్ తుపాకీతో కాల్చుకుని చనిపోయాడు.
- ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ సందీప్ రివాల్వర్‌తో కాల్చుకుని చనిపోయాడు.
- తొర్రూరుకు చెందిన ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ రాజు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోగా, నర్సంపేటకు చెందిన కానిస్టేబుల్ శ్రీనివాస్ దుగ్గొండి పీఎస్‌లో పని చేస్తూ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- తాడ్వాయి పీఎస్‌లో శ్రీనివాస్ అనే కానిస్టేబుల్, డిస్ట్రిక్ట్‌గార్డ్స్‌లో పనిచేస్తూ మల్లంపల్లికి చెందిన కానిస్టేబుల్ కర్ణాకర్‌లు బలవన్మరణానికి పాల్పడటం అప్పట్లో కలకలం రేపింది.

### రూ.26కోట్ల నిధులు మంజూరు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- నర్సింగ్ కళాశాల తరగతులు ప్రారంభం



నర్సింగ్ కళాశాల తరగతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు, కలెక్టర్

**భూపాలపల్లి:** నర్సింగ్ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.26 కోట్ల నిధులు మంజూరు చేసిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. జిల్లాకేంద్రంలోని వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన నర్సింగ్ కళాశాల తరగతులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే సత్యనారాయణరావు జ్యోతి ప్రజ్వలన చేసి తరగతులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 135 సర్వే నంబర్‌లో ఐదు ఎకరాల సువిశాల స్థలంలో నర్సింగ్ కళాశాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. సంవత్సర కాలంలో పనులు పూర్తిచేసి భవనాన్ని పూర్తిస్థాయిలో అందిస్తామని తెలిపారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. నర్సింగ్ కళాశాలలో 45మంది అభ్యర్థులకు అడ్మిషన్లు కల్పించినట్లు తెలిపారు. మొత్తం 60సీట్లు కేటాయించగా 45మంది విద్యార్థులు ఇప్పటికే జాయిన్ అయ్యారని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ట్రాన్స్ క్లినిక్‌ను ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### విద్యార్థిని అస్వస్థత

**కాటారం:** కాటారం మండలకేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో చదువుతున్న విద్యార్థిని వైష్ణవి సోమవారం అస్వస్థతకు గురైంది. వసతి గృహం నుంచి సమీపంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లిన వైష్ణవి శ్వాస సంబంధిత అస్వస్థతకు గురైంది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. శ్వాస సమస్య అధికమవడంతో అక్కడి నుంచి భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

## గ్రామస్థాయి పర్యటన ఉపయోగకరం



కేంద్ర ప్రభుత్వ సెక్షన్ అధికారులతో కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా అధికారులు

- జీవనశైలిలో తృణధాన్యాలు కీలకం
- నేటి 2కే రన్‌ను విజయవంతం చేయాలి
- కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి:** కేంద్ర ప్రభుత్వ సెక్షన్ అధికారులు ప్రభుత్వ పథకాల అమలుపై గ్రామస్థాయి పర్యటన చేయడం ఉద్యోగ జీవితంలో చాలా ఉపయోగపడుతుందని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. జిల్లాకు 10 రోజుల పర్యటనకు విచ్చేసిన ఆరుగురు సభ్యులు గల కేంద్ర సెక్షన్ అధికారుల బృందం సోమవారం కాటారం, రేగొండ మండలాల్లో పర్యటించింది. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, పార్కులు, డంపింగ్ యార్డులు తదితర పథకాలను పరిశీలించామని తెలిపారు. పర్యటన పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో సెక్షన్ అధికారులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గత నెల 26వ తేదీ నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు సెక్షన్ అధికారులు కాటారం మండలంలోని గంగారం, నస్తూరుపల్లి, రేగొండ మండలంలోని రంగయ్యపల్లి, నారాయణపూర్ గ్రామాల్లో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. 72శాతం అటవీ భూములున్న ఈ జిల్లాలో పంటల సాగు, ప్రభుత్వ పథకాల పరిశీలనపై అవగాహన పొందడం ఉద్యోగి భావి జీవితానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన అధికారుల బృందం జిల్లాకు పర్యటనకు రావడం చాలా సంతోషమన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, డీపీఓ నారాయణరావు, ఆర్డీఓ మంగీలాల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**తృణధాన్యాలు ఆరోగ్యానికి మేలు..**

తృణ ధాన్యాలతో కూడిన ఆహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందని, మారుతున్న జీవనశైలిలో తృణ ధాన్యాల వినియోగం కీలకమని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఐడీఓసీ కార్యాలయంలో చెల్పూరు మహిళా సంఘాలు ఏర్పాటుచేసిన తృణ ధాన్యాల కౌంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తృణ ధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

**2కే రన్‌కు తరలిరావాలి..**

ప్రజా పాలన–ప్రజా విజయోత్సవ వేడుకల్లో భాగంగా డిసెంబర్ 3వ తేదీ(నేడు) మంగళవారం ఉదయం జిల్లాకేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ క్రీడా మైదానం నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించనున్న 2 కే రన్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రజలు, యువతీ, యువకులు ప్రతీ ఒక్కరు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. 2కే రన్ నిర్వహణపై సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**సత్వరం పరిష్కరించాలి..**

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాల్‌లో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దిగుబడి కష్టమే..



గండ్రపల్లిలో మిర్చితోట

- మిర్చి పంటపై తెగుళ్ల దండయాత్ర
- గతేడాది, ఈ సారీ అదే పరిస్థితి..

**గతేడాది తెగుళ్ల బెడదతో దిగుబడి తగ్గి ఇబ్బందులు పడ్డ మిర్చి రైతులు ఈ సారి కూడా అదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పంటకు నల్లతామర, పండుతెగులు, ఆకుముడత ఎండు తెగుళ్లు వ్యాప్తి చెందడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు ఇప్పటికే సుమారు రూ.50వేల పెట్టుబడి పెట్టిన రైతులు దిగుబడిపై దిగులు చెందుతున్నారు.**



ఆకుముడత తెగులు సోకిన మిర్చి మొక్క

- భూపాలపల్లి రూరల్

జిల్లాలో గతేడాది 17,480 ఎకరాల్లో మిర్చి సాగు చేయగా ఈ సారి 22,450 ఎకరాలు సాగుచేసినట్లు అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి. 2251, వండర్‌హర్ట్, తేజ,341, 5531 రకాలను ఎక్కువగా సాగు చేశారు. మిర్చికి ప్రతీ ఏడాది ఆశించే నల్లతామరతో పాటు ఈ ఏడాది పండు తెగులు, ఆకుముడత, ఎండుతెగులు, వేరుకుళ్లు జిల్లాలో వ్యాప్తిచెందుతున్నాయి. ఈ ఏడాది సైతం ఇప్పటికే జిల్లాలో రేగొండ, చిట్యాల, భూపాలపల్లి తదితర ప్రాంతాల్లో తెగుళ్ల బెడదను అధికారులు గుర్తించారు. మరింత నష్టం జరుగకుండా ఉద్యానశాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడంతోపాటు రైతులను అప్రమత్తం చేస్తున్నారు.

**దిగుబడిపై దిగులు..**

జిల్లాలో బోర్లు, బావులకిందతో పాటు నల్లరేగడి భూముల్లో వర్షాధారం కింద మిర్చిని సాగు చేస్తున్నారు. కరాకు సాధారణ దిగుబడి 15నుంచి 18 కింటాళ్లు రావాల్సిఉండగా తెగుళ్ల కారణంగా 10 క్వింటాలు మాత్రమే వచ్చింది. ప్రస్తుతం కూడా తెగుళ్లు పంటను ఆశించడంతో రైతులు దిగుబడి ఎంత వస్తుందని టెన్షన్ పడుతున్నారు. గతేడాది క్వింటాల్‌కు ధర రూ.20వేల నుంచి రూ.30వేల వరకు ఉండడంతో రైతులు కొంత ఉపశమనం పొందారు. ఈ సారి ధరలు ఎలా ఉంటాయో అని మదనపడుతున్నారు.



పక్క ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు అంకం నర్సింహారావు. భూపాలపల్లి మండలం పిల్లోనిపల్లి గ్రామం. ఎకరంలో మిర్చిసాగు చేశాడు. ఆదివారం తోటకు ఆకుముడత నివారణకు పురుగుల మందు పిచికారీ చేశాడు. కలుపు, మందులకు ఇప్పటికే రూ.50వేలకు పైగా పెట్టుబడి పెట్టాడు. చివరికి తెగుళ్లతో పంట చేతికి వస్తుందో లేదోనని ఆందోళన చెందుతున్నాడు. జిల్లాలో అధికశాతం రైతుల పరిస్థితి ఇలాగే ఉంది.



భూపాలపల్లి మండలంలోని కొంపెల్లిలో ఎండు తెగులు వ్యాపించిన మిర్చి తోట

**యాజమాన్య పద్ధతులు పాటించాలి**



మిర్చి పంటకు తెగుళ్ల వ్యాపించినట్లు గుర్తించాం. దీనిని అధిగమించి పంటకు నష్టం జరుగకుండా రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా యాజమాన్య పద్ధతులను తెలియజేస్తున్నాం. రైతులు అధైర్యపడకుండా అధికారుల సూచనలు, సలహాలు పాటించి పంటను కాపాడుకోవచ్చు.

- సంజీవరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి

## ఆటే.. ఆత్మస్థైర్యం



తెలంగాణ దివ్యాంగ వీల్‌చైర్ క్రికెట్ జట్టు సభ్యులు

- విధి రాతను ఎదిరించి క్రీడల్లో రాణించి..
- ఆర్థిక చేయూతనందిస్తే మరింత ముందుకు
- వీల్‌చైర్ క్రికెట్‌లో రాణిస్తున్న దివ్యాంగ యువత
- నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

అర్ధ శరీరం పనిచేయకున్నా ఇష్టమైన క్రికెట్ ఆటలో సిక్స్‌లు కొడుతూ, క్యాచ్‌లు పడుతూ అంగవైకల్యమే చిన్నబోయేలా చేశారు. జాతీయ స్థాయి వీల్‌చైర్ క్రికెట్ టోర్నమెంటులో అవార్డుల పంట పండిస్తున్నారు. వీరిలో ఒక్కొక్కరిదీ ఒక్కో ప్రాంతం.. ఉన్నత చదువులు చదువుకున్నది ఒకరైతే.. చదువుకునే స్థోమత లేక కులవృత్తిలో దినసరి కూలీగా పనిచేస్తున్నది మరొకరు. కుల, మత, ప్రాంత బేధాలు లేకుండా వారందరిదీ ఇప్పుడు ఒకే కుటుంబం. అదే దివ్యాంగ వీల్‌చైర్ క్రికెట్ కుటుంబం. ఆటలో విజేత స్థానం కోసమే కాదు కష్ట సుఖాల్లో ఒకరికొకరు తోడుగా ఉంటున్నారు. నేడు (మంగళవారం) ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ దివ్యాంగ వీల్‌చైర్ క్రికెట్ క్రీడాకారులపై కథనం 8లో..

- వరంగల్ స్పోర్ట్స్

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**భూపాలపల్లి రూరల్:** జంగేడు11 కేవీ విద్యుత్ లైన్ ఫీడర్‌పై మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించనుండడంతో నేడు (మంగళవారం) భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ విశ్వాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దకుంటపల్లి, పులిరామయ్యపల్లి, గండ్రపల్లి, మహబూబ్‌పల్లి, పిల్లోనిపల్లి గ్రామాలలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## మావోయిస్టుల మృతదేహాలను పరిశీలించిన ఐపీఎస్‌లు

**ఏటూరునాగారం:** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక అటవీప్రాంతంలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలను సోమవారం ముగ్గురు నూతన ఐపీఎస్‌లు పరిశీలించారు. ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రి పోస్టుమార్టం గదిలో భద్రపర్చిన మావోయిస్టుల మృతహాలను ఐపీఎస్ అధికారులు చైతన్య, గౌతమి, చిత్రంజైన్ క్షుణ్ణంగా పరిశీలించి ఎన్‌కౌంటర్ జరిగిన తీరును మంగపేట ఎస్సై సూరిని అడిగి తెలుసుకున్నారు. ఘటన కారణాలపై ఆరాతీశారు. పోలీసు కాల్పుల్లో జరిగే ఘటనలను స్థానిక పోలీసులతో చర్చించారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్‌లు వారికి వివరించారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఐపీఎస్ అధికారులు

**ఏటూరునాగారం చేరుకున్న మావోయిస్టుల కుటుంబీకులు**

మండలంలోని చెల్పాకలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆరుగురు మావోయిస్టులు భద్రు, జమున, కిశోర్, కామేశ్, జైసింగ్, ముసాకి దేవల్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈక్రమంలో వీరి మృతదేహాలను తీసుకెళ్లేందుకు ఛత్తీస్‌గఢ్ నుంచి వారి కుటుంబ సభ్యులు సోమవారం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి చేరుకున్నారు. వారికి మంగళవారం మృతదేహాలు అప్పగిస్తామని స్థానిక పోలీసులు వెల్లడించారు.

## ఎస్‌జీఎఫ్ బాలికల బాక్సింగ్ పోటీలు షురూ

**వరంగల్ స్పోర్ట్స్:** పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో హనుమకొండ ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని డీఎస్‌ఏ బాక్సింగ్‌హాల్‌లో సోమవారం అండర్–17 రాష్ట్ర స్థాయి బాలికల బాక్సింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. వరంగల్ బాక్సింగ్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చాడ సుభాశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలు ప్రారంభించారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారిణులు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి దస్రూ నాయక్ తెలిపారు. రెండు రోజులు జరగనున్న ఈ పోటీల్లో మొదటి రోజు అండర్–17, రెండో రోజు అండర్–19 విభాగాల్లో క్రీడలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ రిటైర్డ్ జేడీ శ్యాంప్రసాద్, పీఈటీల సంఘం రాష్ట్ర కార్యదర్శి బోగి సుధాకర్, జిల్లా అధ్యక్షుడు గోగు నారాయణ, ఒలింపిక్స్ సంఘం జిల్లా మాజీ కార్యదర్శి మంచాల స్వామిచరణ్, బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా బాధ్యులు పోతరాజు రాజేందర్, పెద్దమ్మ నర్సింహరాములు, శీలం పార్థసారథి, శీలం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


పోటీలు ప్రారంభిస్తున్న సుభాశ్‌రెడ్డి

## అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

- సాంక్రియ తండాలో ఘటన
- భర్త, బంధువులు చంపారని పోలీసులకు తండ్రి ఫిర్యాదు


దివ్య (ఫైల్)

**సంగెం:** అనుమానాస్పదస్థితిలో ఓ వివాహిత మృతి చెందింది. ఈ ఘటన సంగెం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. మండలంలోని నర్సానగర్ శివారు జాటోత్ తండాకు చెందిన జాటోత్ రవీందర్ రెండో కూతురు దివ్య(22)ను అదే తండా పరిధిలోని సాంక్రియ తండాకు చెందిన గుగులోత్ పవన్‌కు ఇచ్చి 2021లో వివాహం జరిపించారు. కొంతకాలం వరకు సజావుగా సాగిన కాపురంలో అశ్విత జన్మించింది. ఈ క్రమంలో పవన్ కొంత కాలంగా వివాహేతర సంబంధం పెట్టుకుని దివ్యను ఇబ్బందులకు గురిచేసేవాడు. దీంతో దివ్య తల్లిగారింటి వద్ద ఉంటోంది. గత సెప్టెంబర్ 6న పవన్ పెద్దమనుషులను తీసుకుని వచ్చి ఇక నుంచి ఇబ్బందులకు గురిచేయనని చెప్పి భార్యను కాపురానికి తీసుకెళ్లాడు. అయినా అతడి తీరులో మార్పు రాలేదని దివ్య తన తల్లితండ్రులకు చెప్పేది. ఈక్రమంలో సోమవారం ఉదయం పవన్ తన మామ రవీందర్‌కు ఫోన్ చేసి దివ్య ఆరోగ్యం బాగాలేదని ఎంజీఎంకు తీసుకెళ్తున్నానని సమాచారం ఇచ్చాడు. దీంతో తల్లిదండ్రులు ఎంజీఎం వెళ్లి చూడగా దివ్య మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తన కూతురు దివ్యను అల్లుడు పవన్, అతడి కుటుంబీకులు చంపినట్లు రవీందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

## బావిలో జారిపడి ఇంటర్ విద్యార్థిని..

- బోడమంచ్యాతండాజీపీలో ఘటన

**కేసముద్రం:** ఓ ఇంటర్ విద్యార్థిని వ్యవసాయబావిలో జారిపడి మృతి చెందింది. ఈ ఘటన సోమవారం మండలంలోని బోడమంచ్యాతండాజీపీలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు కథనం ప్రకారం.. తండాకు చెందిన బోడ లాల్యా, దేవి దంపతుల రెండో కుమార్తె శ్రావణి(17) హనుమకొండలోని ఓ గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఇటీవల ఇంటికి వచ్చింది. తమ మేకలను కాసేందుకు పంటపొలాల వైపునకు వెళ్లింది. ఈ క్రమంలో వ్యవసాయబావి వద్దకు వెళ్లగా కాలుజారడంతో అందులో పడి మృతి చెందింది. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం మానుకోట జిల్లా ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మురళీధర్‌రాజు తెలిపారు.



## భార్యను హత్య చేసిన వ్యక్తి అరెస్ట్

**కేసముద్రం:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో భార్యను హత్య చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. కేసముద్రంస్టేషన్‌కు చెందిన బత్తుల వీరన్న.. తన భార్య అనూషపై అనుమానంతో గత నెల 30న అర్ధరాత్రి ఆమె మెడకు చున్నీతో ఉరివేసి హత్యచేశాడు. ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించి పరారయ్యాడు. ఈ క్రమంలో సోమవారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో కనిపించగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు.



# ఆటే.. ఆత్మస్థైర్యం

## విధిరాతను ఎదురించి క్రికెట్‌లో రాణించి..

- ఆట ముందర వైకల్యం చిన్నబోయింది
- వీల్‌చైర్ క్రికెట్‌లో దివ్యాంగ యువత ప్రతిభ
- సీఎం కప్ టోర్నీలో అవకాశం కల్పించాలని వినతి

నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



అందరి మాదిరిగానే వారూ జన్మించారు. కొన్నేళ్ల వరకు ఎలాంటి ఇబ్బందులు లేని ఆనందకర జీవనం గడిపారు. స్నేహితులతో ఆడారు.. పాడారు. కుటుంబీకులతో ఉల్లాసంగా గడిపారు. అయితే అంతకాలం హాయిగా సాగిన వారి జీవితం అనుకోని ఘటనలతో తలకిందులైంది. కొందరు యువకులు విధి రాతలో బందీలైతే.. మరి కొందరి యువకులు పోలియో మహమ్మారితో ఆటాపాటలకు దూరమయ్యారు. బాల్యం నుంచి అవమానాలు ఎదుర్కొన్న వారు కొందరైతే.. ఉన్న ఫలంగా మంచానికే పరిమితమై మనోవేదనతో రగిలిన వారు కొందరు. ఏదైతేనేం సమాజంలో అందరిలా తాము లేమనే బాధతో ఎన్నో నిద్రలు లేని రాత్రులు గడిపారు. అయితే తాము కూడా సాధారణ జీవితం గడపలేమా అని క్షణకాలం ఆలోచనతో విధిరాతను ఎదురించారు. వీల్‌చైర్ క్రికెట్‌లో రాణిస్తూ నేడు సమాజంలో తమకంటూ ప్రత్యేక హోదాను దక్కించుకున్నారు. వారే పలువురు దివ్యాంగులు. వచ్చే నెలలో జరిగే సీఎం కప్ టోర్నీలో అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు. నేడు (మంగళవారం) ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వారిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

– వరంగల్ స్పోర్ట్స్

### సీఎం కప్ టోర్నమెంట్‌లో అవకాశం కల్పించాలి

2011లో ఓ ఫంక్షన్‌లో ఎలక్ట్రిషియన్ పనిచేస్తుండగా పక్కన ఉన్న జనరేటర్ మీద పడింది. దీంతో స్పైనల్‌కాట్ దెబ్బతిని శరీరంలో చలనం లేకుండా పోయింది. పదేళ్లు మంచానికే పరిమితమయ్యా. ఈ క్రమంలో సోషల్ మీడియా ద్వారా విశాఖపట్టణానికి చెందిన వీల్‌చైర్ క్రికెటర్ రమణ సుబ్బారావు(మాజీ రంజీ ప్లేయర్) పరిచయమయ్యాడు. ఆయన సలహాలతో తెలంగాణ దివ్యాంగ వీల్‌చైర్ క్రికెట్ టీంను ఏర్పాటు చేశా. వచ్చే నెలలో జరిగే సీఎం కప్ టోర్నమెంట్‌లో దివ్యాంగ వీల్‌చైర్ క్రికెట్ పోటీలకు అవకాశం కల్పించాలి.

– కొల్లూరి అరుణ్‌జాన్, క్రిస్టియన్ కాలనీ, కెప్టెన్, దివ్యాంగ వీల్‌చైర్ క్రికెట్ టీం



### వారిలో ఒకరినై శిక్షణ ఇస్తుంటా..

తెలంగాణ దివ్యాంగ వీల్‌చైర్ అసోసియేషన్, టీం కెప్టెన్ కొల్లూరి అరుణ్‌జాన్‌లో క్రికెట్‌లో రాణించాలనే తపన గమనించా. సాధారణ క్రీడాకారులతో పోల్చితే వీరికి శిక్షణ ఇవ్వడం చాలా కష్టం. వీళ్ల కోసం నేను వీల్‌చైర్ నడపడంలో శిక్షణ తీసుకున్నా. ఆ తర్వాత వారికి బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్‌పై శిక్షణ ప్రారంభించా. ప్రస్తుతం దేశంలో తెలంగాణ దివ్యాంగవీల్ చైర్ టీం మొదటి స్థానంలో ఉంది. 2023లో వరంగల్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్.. మాకు చేయూతనందించారు. ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందించాలి.

– సదురాల మధు, కోచ్, క్రిస్టియన్ కాలనీ


వరంగల్ క్రిస్టియన్ కాలనీలోని చర్చి గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేస్తున్న వీల్‌చైర్ క్రికెటర్లు

### ఏడాదిన్నర వయసులో పోలియో



మాది వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని బందనపల్లి తండా. ఏడాదిన్నర వయసులో జ్వరంతో ఉన్న సమయంలో పోలియో ఇంజక్షన్ వేయిస్తే వికటించి రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా ఇంటి నుంచి పని చేస్తున్నా. 2021లో కెప్టెన్ అరుణ్‌జాన్ సమాచారం, స్ఫూర్తితో ఇప్పటి వరకు జాతీయస్థాయిలో పది టోర్నమెంట్‌లో పాల్గొని బహుమతులు సాధించా.

– గుగులోత్ రామ్‌జీ నాయక్, దివ్యాంగ క్రికెటర్

### కూలి చేస్తూనే క్రికెట్ ఆడుతున్న..



మూడేళ్ల వయసులో పోలియోతో నా రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. పేదరికంతో విద్యాభ్యాసానికి దూరమయ్యా. కుటుంబ భారంతో కులవృత్తి స్వర్ణకార కూలి పనిచేసుకుంటూ చాలీచాలని ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా. బాల్యంలో అందరిలా ఆడుకోవాలని ఉన్నా కాళ్లు చచ్చుబడడంతో ఆరు సంవత్సరాలు ఇంటి నుంచి బయటకు రాలేదు. ఈ క్రమంలో నన్ను అరుణ్‌జాన్ క్రికెట్ ఆడాలని కోరి ఆటలో అన్నీ నేర్పించాడు. ప్రస్తుతం తెలంగాణ టీంలో ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నా.

– మండల అశోక్, వీల్‌చైర్ క్రికెటర్, కరీమాబాద్

### తాటిచెట్టుపైనుంచి పడ్డా..



డిగ్రీ పూర్తి చేసిన అనంతరం కులవృత్తి (కల్లుగీత) చేసుకుంటూ కుటుంబానికి ఆసరా అయ్యేవాడిని. 2017లో చెట్టుపై నుంచి పడడంతో స్పైనల్‌కాట్ దెబ్బతింది. దీంతో కాళ్లు, నడుము చచ్చుబడిపోయింది. ఈ క్రమంలో కెప్టెన్ అరుణ్‌జాన్ ప్రోత్సాహంతో 2022 నుంచి క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నా. ఇప్పటి వరకు పదికి పైగా జాతీయ టోర్నమెంట్లలో పాల్గొన్నా. జీవితంలో ఏదో సాధించగలననే నమ్మకం వచ్చింది.

– పల్లె రాకేశ్, వీల్‌చైర్ క్రికెటర్, ల్యాదెల్ల, దామెర, హనుమకొండ

### జట్టుకు వెన్నుముకగా..



అన్నీ అవయవాలు సక్రమంగా ఉన్న వారికి రైలు ప్రయాణమంటే సాహసం. అలాంటిది వీల్‌చైర్‌లో రాష్ట్రాలు తిరగాలంటే ఊహకందని అంశం. అలాంటిది పదకొండు మందిని ట్రైన్ ఎక్కించడం, దించడం, వీల్‌చైర్లు, లగేజీ జాగ్రత్తలు చూసుకుంటున్నాం. వీల్‌చైర్‌లో ఉన్న క్రీడాకారులను గమ్యస్థానాలకు తీసుకెళ్తూ జట్టుకు వెన్నుముకగా నిలుస్తున్నాం.

– ఈర్ల సందీప్ అసిస్టెంట్ కోచ్, కొడకండ్ల వినయ్, మేనేజర్

### విద్యుత్‌షాక్‌తో రెండు కాళ్లు, ఒక చేయి పోయింది



ఎనిమిది సంవత్సరాల వయసులో పతంగి ఎగురవేస్తుండగా విద్యుత్‌వైర్లకు చిక్కుకుంది. పతంగిని తీసే క్రమంలో షాక్ గురై నా రెండు కాళ్లు, కుడి చేయిని కోల్పోయా. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడ్డా. ప్రస్తుతం తెలంగాణ వీల్‌చైర్ క్రికెట్ జట్టుకు వైస్‌కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న. త్వరలో జరగనున్న సీఎం కప్ టోర్నమెంట్‌లో వీల్‌చైర్ క్రికెట్ పోటీలకు అవకాశం కల్పించాలి.

– మోనూ షేక్, వైస్ కెప్టెన్

### రోడ్డు ప్రమాదంలో స్పైనల్ కాట్ దెబ్బతింది



నేను హనుమకొండలో ఎల్‌జీ స్టోర్‌లో ఉద్యోగం చేసేవాడిని. విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా టాటా ఏస్ ఢీకొనడంతో స్పైనల్‌కాట్ దెబ్బతింది. దీంతో శరీరంలో కిందిభాగం చచ్చుబడిపోయింది. మిత్రుడు రాకేశ్‌తో అరుణ్‌జాన్ పరిచయమయ్యాడు. శని, ఆదివారాలు క్రికెట్ సాధన చేస్తుంటాం. అరుణ్‌జాన్, కోచ్ మధు సహకారంతో బ్యాట్స్‌మెన్‌గా రాణిస్తున్నా.

– కుక్కల శివ, వీల్‌చైర్ క్రికెటర్, ఖిలావరంగల్

### ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ శాతం పెంచాలి



2019లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నా రెండు కాళ్లుపోయాయి. 2021లో అరుణ్‌జాన్ ద్వారా తెలంగాణ దివ్యాంగ క్రికెట్ టీం ఏర్పాటులో భాగస్వామ్యుడినయ్యా. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్‌గా పని చేస్తున్నా. ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగ రిజర్వేషన్లు పెంచాలి.

– ఎలిమెల శ్రీకాంత్, వీల్‌చైర్ క్రికెటర్

## పెండింగ్ డీఏ, పీఆర్సీ త్వరలోనే సాధిస్తాం

- రాష్ట్ర గెజిటెడ్ అధికారుల సంఘం కేంద్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

**జనగామ:** రాష్ట్రంలో ఉద్యోగులకు రావాల్సి పెండింగ్ డీఏ, పీఆర్సీ త్వరలోనే తీసుకువస్తామని రాష్ట్ర గెజిటెడ్ అధికారుల సంఘం కేంద్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని విజయ ఫంక్షన్‌హాల్‌లో కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు జగన్మోహన్‌రావు ఆధ్వర్యాన సోమవారం జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ పోరాట అమరవీరుల ఆశయాలు, అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలతో టీజీఓ సంఘం ఏర్పాటైయిందని, ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుంటూ ప్రభుత్వ పథకాలు, సంక్షేమాన్ని ప్రజలకు అందించడంలో ముందు వరుసలో ఉండాలని సూచించారు.

**జిల్లా అధ్యక్షుడిగా చంద్రగిరి ఏకగ్రీవం**

టీజీఓ కేంద్ర సంఘం కోశాధికారి ఉపేందర్‌రెడ్డి, ముదిగొండ చంద్రశేఖర్ ఆధ్వర్యాన జిల్లా నూతన కమిటీ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా చంద్రగిరి శ్రీనివాస్(పీఆర్–డీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ డి.సారంగపాణి(ఏడీ–వెటర్నరీ), ఉపాధ్యక్షులుగా జి.రాజేంద్రకుమార్, ఎం.శేషగిరి, జీవీ.శ్రీనివాస్‌గౌడ్, పి.జయపాల్‌రెడ్డి, కె.సంధ్యారాణి, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎస్.స్వరూప, కార్యదర్శి ఎస్.కొర్నేలియస్, సహాయ కార్యదర్శులుగా ఏకే.మన్సూరి, డి.రామారావునాయక్, యూ.సంపత్‌కుమార్, ఆర్.వీరస్వామి, బి.శ్రీనివాసులు, కె.నిర్మల, కోశాధికారిగా ఎండీ.గౌస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు అశోక్‌రెడ్డి, బి.విజయ్‌కుమార్, మరో 30 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో ఉపేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. సమావేశంలో టీజీఓ కేంద్ర సంఘం నేతలు జగన్మోహన్ రావు, సత్యనారాయణ, శ్యామ్, రామకృష్ణగౌడ్, పరమేశ్వర్‌రెడ్డి, రాజేష్‌కుమార్, కిరణ్‌కుమార్, వెంకటేశ్వరరావు, న్యూస్ ఎడిటర్ అస్నాల శ్రీనివాస్, రాష్ట్రం నుంచి వచ్చిన వివిధ జిల్లాల నేతలు డాక్టర్ రామారావు, ఈగ వెంకట్, రఫీ, అన్వర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు

## గంజాయి చాక్లెట్లు స్వాధీనం

**వరంగల్:** వరంగల్ రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో సుమారు రూ. 25వేల విలువైన 90గ్రాముల ఎండు గంజాయితో పాటు గంజాయితో తయారు చేసిన 167 చాక్లెట్లు స్వాధీనం చేసుకుని బిహార్‌కు చెందిన పప్పుశర్మ, రత్నాకర్ రాం, దినేశ్‌రామ్‌తో పాటు మరో ఇద్దరు బాలురను అదుపులోకి తీసుకున్నట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరంతా సోమవారం తమ స్వగ్రామాల నుంచి గంజాయితో తయారుచేసిన చాక్లెట్లు విక్రయించడానికి రైలులో వరంగల్ వచ్చారు. సాయంత్రం బస్టాండ్, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతుండగా ఇంతేజార్‌గంజ్ పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


## ఎఫ్‌సీఐలో బియ్యం నిల్వలు ఫుల్..

- ప్రత్యేక రేక్‌ల కోసం అధికారుల వినతి
- ప్రైవేట్ గోడౌన్ల లీజుకు యత్నాలు

**కాజీపేట:** కాజీపేటలోని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) గోడౌన్లలో బియ్యం నిల్వలు క్రమేపి పెరుగుతున్నాయి. నిర్దేశించిన లక్ష్యం మేరకు రేక్‌లు (గూడ్స్ రైళ్లు) రాకపోవడం.. మిల్లర్ల నుంచి సీఎంఆర్ వస్తుండడంతో గోడౌన్లు బియ్యం బస్తాలతో నిండుతున్నాయి. ఇప్పుడిప్పుడే జిల్లా నుంచి సీఎంఆర్ బియ్యం లారీలు తరలివస్తున్న నేపథ్యంలో నిల్వ చేయడానికి సరిపడ స్థలం లేక సర్దుబాటు చేయడానికి అధికారులు సతమతమవుతున్నారు. బియ్యం లారీలను సకాలంలో లోపలికి అనుమతించకపోవడంతో ఆ వాహనాలు ఎఫ్‌సీఐ రహదారిలో నిలిచి ఉంటున్నాయి. గతేడాది నుంచి బియ్యం అంతంతమాత్రమే ఇతర రాష్ట్రాలకు తరలిపోవడంతో కొత్తగా వచ్చే బియ్యం నిల్వ చేయడం కష్టంగా మారింది. ఇదీ ఒక కాజీపేట ఎఫ్‌సీఐ గోడౌన్ పరిస్థితే కాదు..వరంగల్, నెక్కొండ, యశ్వంతపూర్ లోనూ కొనసాగుతోంది.

**రేక్‌లు కేటాయించాలని అధికారుల వినతి..**

ఇతర రాష్ట్రాలకు బియ్యం నిల్వలను తరలించడానికి అవసరమైన రేక్‌లను (గూడ్స్ రైళ్లను) కేటాయించాలని ఎఫ్‌సీఐ అధికారులు కేంద్ర ప్రభుత్వంతో పాటు రైల్వే అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. ఇటీవల రెండు రేక్‌లు మాత్రమే రావడంతో బియ్యం నిల్వలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేశారు. దీంతో కొంతమేర గోడౌన్లలో ఖాళీ స్థలం ఏర్పడింది. దేశ వ్యాప్తంగా నీటి లభ్యత పెరగడంతో వరి పంటల సాగు సమృద్ధిగా పెరుగుతోంది. స్థానికంగానే దొడ్డు రకం బియ్యం లభిస్తుండడంతో దిగుమతి చేసుకోవాల్సిన అవసరం తప్పింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవలి నిబంధనలను కాస్త సడలించడంతో ఇప్పుడిప్పుడే బియ్యం ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. డిసెంబర్, జనవరి నెలల్లో ఐదు, ఆరు రేక్‌ల కేటాయిస్తే తప్ప బియ్యం నిల్వలు ఇతర ప్రాంతాలకు తరలిపోయే పరిస్థితులు కనిపించడం లేదు


కాజీపేటలోని ఎఫ్‌సీఐలోని బియ్యం నిల్వలు

**అద్దె గోడౌన్ల కోసం వెతుకుతున్న అధికారులు**

గోడౌన్లలో బియ్యం నిల్వలు పేరుకుపోవడంతో అధికారులకు ఏం చేయాలో తెలియడం లేదు. దీంతో అద్దె గోడౌన్ల కోసం వెతకడం ప్రారంభించారు. రఘునాథపల్లి, వడ్లకొండ, ఏనుమాములు, నెక్కొండ ప్రాంతాల్లోని ప్రైవేట్ గోడౌన్లను పరిశీలించారు. బియ్యం నిల్వ చేయడానికి, తరలించడానికి అనుకూలంగా ఉండే ప్రాంతాలను ఎంపిక చేయడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

## ఆర్టీసీ అధికారులతో ఈడీ సమావేశం

**కాజీపేట అర్బన్ :** ఆర్టీసీ వరంగల్ రీజియన్‌ను సోమవారం కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుష్రోష్ ఖాన్ సందర్శించారు. ఆయనకు వరంగల్ రీజినల్ మేనేజర్ డి. విజయభాను, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం రీజియన్‌లోని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రీజియన్‌లోని అన్ని విభాగాల పనితీరుపై ఆరాతీశారు. అత్యధిక ఆదాయం సాధించే జోన్లు అగ్రగామిగా కొనసాగాలని సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. వరంగల్ –2 డిపోలో ఏర్పాటు చేసిన కార్తీక మాసం వనభోజనాల కార్యక్రమంలో పాల్గొని పలువురిని సన్మానించారు. సంస్కృతీ,సంప్రదాయాలను రాబోవు తరాలకు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ భాను కిరణ్, ఏఓ రవీందర్, అర్పిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఈడీ కుష్రోష్‌ఖాన్‌కు స్వాగతం పలుకుతున్న వరంగల్ రీజియన్ సిబ్బంది

## బాలిక అదృశ్యం

**నర్సంపేట రూరల్ :** ఓ బాలిక అదృశ్యమైంది. ఈ ఘటన సోమవారం నర్సంపేట మండలంలోని ఓ గ్రామంలో చోటుచేసుకుంది. నర్సంపేట రూరల్ ఎస్సై అరుణ్ కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికల లక్నెపల్లి ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఉదయం స్కూల్‌కు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన బాలిక.. సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై అరుణ్ తెలిపారు.

## రుద్రేశ్వరాలయంలో ఘనంగా గౌరీనక్త వ్రతం

**హన్మకొండ కల్చరల్:** కార్తీకం ముగిసి మార్గశిర మాసం ప్రారంభమైన సందర్భంగా నగరంలోని వేయిస్తంభాల ఆలయంలో సోమవారం గౌరీనక్త పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ నాట్య మండపంలో రుద్రేశ్వరీ అమ్మవారిని ప్రతిష్ఠించి 51 కిలోల హరిద్రాచూర్ణంతో(పసుపుతో) గౌరీమాతగా అలంకరించారు. గౌరీసూక్తం శ్రీసూక్తవిధానంతో లలితా సహస్రనామ పారాయణంతో కుంకుమార్చనలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. ధూపదీపనైవేద్యాలు సమర్పించారు. మహిళలు పాల్గొని లలితాసహస్ర నామపారాయణం భజనలు చేశారు. పాల్గొన్న మహిళందరికీ అక్షింతలు, పసుపు, కుంకుమ, గాజులు, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిబ్బంది ఎస్.మధుకర్, ఎల్.రామకృష్ణ, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


దేవాలయంలో గౌరీనక్త వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు